## క్లుప్తంగా

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నవాబ్

**నారాయణఖేడ్:** హుస్త్రాన(జి) గ్రామంలో ప్రత్యేక అభివృద్ధి నిధులతో సీసీ రోడ్డు పనులను ఆదివారం మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు నవాబ్, సర్పంచ్ బారి ఆశీర్వాదం పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు.

### బాలాజీ ఫౌండేషన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న బలరాం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పట్టణానికి చెందిన శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాంకు ఆదివారం మహబూబ్‌నగర్‌లో శ్రీకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాల్లో అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా సామాజిక సేవలో ముందున్నామని వారు తెలిపారు.

### బీజేపీలోకి వలసలు



బీజేపీలో చేరుతున్న ఉపసర్పంచ్ మంగమ్మ

**జహీరాబాద్:** రానున్న రోజుల్లో బీజేపీలోకి భారీ వలసలు ఉంటాయని పార్టీ రాష్ట్ర నాయకుడు రాంచందర్ రాజనర్సింహా అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పిఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కె.జనార్దన్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్ పాటిల్, పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** తాగునీటి సమస్య పరిష్కారానికి ఆదివారం బోరుబావిని తవ్వించినట్లు సర్పంచ్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్కర్ వాడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఎదుర్కొంటున్నట్టు తెలుసుకొని బోరు బావి తవ్వకం పనులను సర్పంచ్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపతమ్మ, మాజీ ఎంపీటీసీ నర్సింలు, వార్డు సభ్యులు, నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ఏసప్ప, నర్సింలు, భాస్కర్ రెడ్డి, నర్సింలు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముగ్గురికి కోవిడ్ టెస్టులు

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ముగ్గురికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని ఆయన పేర్కొన్నారు.

### వాల్ క్లాక్‌లు బహూకరణ



వాల్ క్లాక్‌లు అందిస్తున్న దృశ్యం

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల కేంద్రం శివ్వంపేటలోని బగలాముఖి శక్తిపీఠానికి పూర్వ స్నేహితులు వాల్ క్లాక్‌లు ఆదివారం బహూకరించారు. శివ్వంపేట ఉన్నత పాఠశాలలో 1991 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆలయానికి రెండు పెద్ద వాల్ క్లాక్‌లు గ్రామ అర్చకుడు పురుషోత్తమశర్మ, ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్వామిగౌడ్, నర్సింలు, కృష్ణ, సుదర్శన్, మహేశ్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ప్రమాదాలకు అడ్డా రేడియల్ రోడ్డు

- వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వినతి
- పట్టించుకోని అధికారులు



అతివేగంతో పల్టీకొట్టిన కారు (ఫైల్)

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** గోపనపల్లి తండా నుంచి తెల్లాపూర్ మీదుగా కొల్లూరు రింగ్ రోడ్డు వరకు ఉన్నా రేడియల్‌రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. నిత్యం ఈ మార్గంలో ఏదో ఓ చోట ఓదో ఒక ప్రమాదం జరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ఈ రోడ్డును ఏళ్లుగా వేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంలేదు. దీంతో రోజురోజు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నాయి. ఈ రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నారు. ప్రమాదాలను కొని తెచ్చుకున్న దాఖలాలు కూడా లేకపోలేదు.

**హెచ్చరిక బోర్డులు లేక**

ఈ మార్గంలో పలువురు ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రమాదాల నివారణకు పోలీసులు మాత్రం స్థానికుల సహకారంతో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పలుచోట్ల రోడ్లపై భారీ గేట్లను ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుగుండా వీధి దీపాలు లేకపోవడం, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాల నివారణకు స్థానికులు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరినప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. వాహనదారులు మాత్రం ఈ రోడ్డు ఖాళీగా కనిపించడంతో మితిమీరిన వేగంతో తమ వాహనాలను నడుపుతున్నారు. శనివారం రాత్రి మంథని స్కూల్ సమీపంలోని రేడియల్ రోడ్డుపై ఓ కారు వేగంగా వచ్చి మరో కారును ఢీకొట్టడంతో ఆ కారు పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తు కార్లలో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రేడియల్ రోడ్డును త్వరగా పూర్తి చేయడంతో పాటు రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు పక్కన వీధిదీపాలు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## పండగలను వైభవంగా నిర్వహిస్తాం



పండగల నిర్వహణపై మాట్లాడుతున్న కార్పొరేటర్



రామచంద్రాపురం(పటాన్‌చెరు):మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్పనగేశ్

**పటాన్‌చెరు టౌన్:** ఉగాది, శ్రీరామనవమి వైభవంగా నిర్వహిస్తామని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం బండ్లగూడలో పండగల నిర్వహణపై ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధు సూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...22న ఉగాది, 30 న శ్రీ రామనవమి ప్రతీ ఏడాది లాగే ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ టౌన్ అధ్యక్షుడు గోపాల్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ పెద్దలతో ప్రత్యేక సమవేశం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండగలపై గ్రామ పెద్దలతో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22న ఉగాది, 30న శ్రీరామనవమి, ఏప్రిల్ 6 హనుమాన్ జయంతి జరుపుకునేందుకు వేద పండితులు నిర్వహించారు. ఉగాది రోజున ఉదయం10:30 నుంచి 11 గంటల వరకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారన్నారు. జూన్ 1న ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న శివాలయం, శ్రీ రామాలయం, నాగులమ్మ గుడి, గణపతి ఆలయం విగ్రహప్రతిష్ఠాపన చేస్తారని వారు పేర్కొన్నారు.

### నీటి సమస్య పరిష్కరించండి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న తండావాసులు

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల పరిధిలోని బిక్యా పంచాయతీ నాను తండాలో తాగునీటి ఎద్దడి నెలకొంది. నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ తండా వాసులు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. రక్షితవాటర్ ట్యాంక్‌కు సంబంధించి బోరు మోటార్ కాలిపోయింది. దీంతో పాటు మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని తండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తండాలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా, మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించి మోటార్ కాలిపోవడంతో ఆటంకం ఏర్పడిందని తండాలో ఉన్న రెండు సింగిల్ ఫెజ్ మోటార్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు.

### నేడు బీజేపీ దీక్ష

**నారాయణఖేడ్:** టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో సోమవారం ఉదయం 10గంటలకు ఖేడ్ రాజీవ్‌చౌక్‌లో నిరసన దీక్ష నిర్వహిస్తారని బీజేపీ కన్వీనర్ కొటాలే రజనీకాంత్ తెలిపారు.

### దూర విద్యతో బంగారు భవిష్యత్

**ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త వెంకటస్వామి**

**పాపన్నపేట(మెదక్):** చదువు మధ్యలో మానేసిన వారికి దూర విద్య బంగారు భవిష్యత్ నిలుస్తుందని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా సమన్వయ కర్త వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏప్రిల్ చివరి వారంలో ఓపెన్ పరీక్షలుంటాయని చెప్పారు. విద్యార్థులు తప్పకుండా తరగతులకు హాజరు కావాలని కోరారు. అభ్యాసకులు విద్యార్థుల్లో ఉత్తేజాన్ని నింపాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకటేశం, ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జ్ వీరేశం, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



పటాన్‌చెరు టౌన్: దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జహీరాబాద్: ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జిన్నారం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

**పటాన్‌చెరు టౌన్:** ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్, కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మ దహనం**

**జిన్నారం(పటాన్‌చెరు):** పేపర్ లీకేజీకి కారణమైన ప్రతీ ఒక్కరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేస్తూ కాంగ్రెస్ ఆదివారం జిన్నారంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, గంగు రమేశ్, భాస్కర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మడిదలలో**

కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దివీరారెడ్డి గుమ్మడిదలలో నిరసన చేపట్టారు. శ్రీనివాస్‌రెడ్డి, మద్ది ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్:** జహీరాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి ర్యాలీ నిర్వహిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పి.నర్సింహారెడ్డి, మక్సూద్ అహ్మద్, భీమయ్య పాల్గొన్నారు.

**నారాయణఖేడ్:** నారాయణఖేడ్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి నిరసన చేపట్టారు. రాజీవ్‌చౌక్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ దారం శంకర్, సుధాకర్‌రెడ్డి, వినోద్‌పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు



కొడిపల్లి(నర్సాపూర్): రాయిలాపూర్‌లో

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని కంచన్‌పల్లిలో శ్రీశీతలామాత సహిత రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పట్లోరి బాలకృష్ణారావు, రాధ దంపతులు పట్లోరి ఫౌండేష్ ఆధ్వర్యంలో ఆలయాలను నిర్మించి, ప్రతిష్ఠోత్సవాలు చేశారు. గ్రామ పురోహితులు రాజమౌళిశర్మ, మెట్టురాములు శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు, నిర్వహించి దేవతామూర్తుల యంత్ర, విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజినీ సుధాకర్, ఎంపీటీసీ శివ్వయ్య, పట్లోరి తిరుపతిరావు, హిమాద్రిరావు, మాజీ సర్పంచ్ సత్యంగౌడ్, నాయకులు శ్రీనివాసరావు, సుధకార్, శ్రీనివాస్, రామకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**రాయిలాపూర్‌లో నల్లపోచమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ**

మండలంలోని రాయిలాపూర్‌లో శ్రీనల్లపోచమ్మ దేవి యంత్ర, విగ్రహ ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామ పురోహితులు ఉమాశంకరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరగగా సర్పంచ్ శేఖులు దంపతులు పూజలు నిర్వహించగా, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

# పేదల సంక్షేమానికి కృషి

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



ఎల్ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** పేదల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ విద్యుత్‌నగర్‌కాలనీకి చెందిన రవికుమార్‌కు మెరుగైన వైద్య సేవలకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ఎల్ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న చింతా గోపాల్, కౌన్సిలర్లు

**మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్**

**సదాశివపేట(సంగారెడ్డి):** క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తుందని మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మర్షత్ దర్గా క్రికెట్ మైదానంలో రూ.40లక్షలతో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లడ్ లైట్ల ఏర్పాటుతో డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించుకోవచ్చన్నారు. దీంతో శిక్షణ సమర్థవంతంగా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ రాజేశ్, బీఆర్ఎస్ నాయకుడు చింతసాయికుమార్, కౌన్సిలర్లు గుండురవి, విద్యాసాగర్‌రెడ్డి, విశ్వనాథం, పులిమామిడిరాజు, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ కలీమ్‌పటేల్, మాజీ కో ఆప్షన్ మెంబర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, నాయకులు మొబిన్, సతాని శ్రీశైలం పాల్గొన్నారు.

### పంట పరిహారం చెల్లించాలి

**వట్‌పల్లి(అందోల్):** పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని మాజీ జెడ్పీ చైర్మెన్, బీజేపీ నేత ఎం.బాలయ్య పేర్కొన్నారు. ఆదివారం వట్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎకరాకు వేలల్లో పెట్టుబడులు పెట్టి సాగుచేసిన రైతులకు అకాల వర్షం తీవ్ర నష్టాన్ని గురిచేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు



### విరిగిన చెట్టు కొమ్మలు



టౌన్‌షిప్‌లో రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్ఈఎల్ టౌన్ షిప్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. టౌన్‌షిప్‌లోని పలుచోట్ల విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడడంతో కాలనీలో రాత్రి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌తో నీలం మధు

**పటాన్‌చెరు టౌన్:** బీసీలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని చంద్రగార్డెన్లో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో ముదిరాజ్ నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ను, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్‌లో బీసీలకు ప్రాధన్యత ఇస్తున్నారని చెప్పేందుకు బండాప్రకాష్‌ని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ చేయడమే నిదర్శనమన్నారు. బీసీలకు ఉన్నత పదవులు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. మూడోసారి కూడా కేసీఆర్‌ని సీఎం చేసేందుకు ప్రతీ ఒక్కరు ఆశ్వీరదించాలని ఆయన కోరారు. ఈ సమ్మేళనంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్, ముదిరాజ్ మహాసభ సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కోటి అనుషమ్మను, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజుతో కలసి నీలం మధును అభినందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ, వరలక్ష్మి, అల్లుడు, జగన్, నాగేష్, మహేష్, వినోద్, ప్రదీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు కాంగ్రెస్ సమావేశం

**నారాయణఖేడ్:** మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కిష్టారెడ్డి గృహంలో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు ఖేడ్ నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. హత్ సే హాత్ జోడో భాగంగా ఈ నెల 25న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి బోసురాజు, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి నవీన్‌జాదవ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, శ్రీధర్‌బాబు, అంజన్‌కుమార్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి పాదయాత్ర చేస్తారన్నారు.

# ఆదివారం.. పప్పు, సాంబారేనా!



విద్యార్థులకు పప్పుచారును వడ్డిస్తున్న దృశ్యం

- దేవునూర్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో పప్పుచారుతో భోజనం
- పట్టించుకోని అధికారులు

**వట్‌పల్లి(అందోల్):** హాస్టళ్లలో పౌష్టికాహారం అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మెనూ అమలుకు నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. దేవునూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం మెను ప్రకారం మధ్యాహ్న భోజనంలో భగార అన్నం, చికెన్ కూర, సాంబారు ఇవ్వాలి. కాని దీనికి విరుద్ధంగా అన్నం, సాంబారు మాత్రమే విద్యార్థులకు వడ్డించారు. ఇదేంటని హాస్టల్ సిబ్బందిని ప్రశ్నించగా చికెన్ రాత్రి పెడుతామని బదులిచ్చారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. హాస్టల్ సిబ్బందిపై పర్యవేక్షించాల్సిన వార్డెన్ రెండు రోజులుగా హాస్టల్‌కే రావడం లేదని విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన ఆహారం అందించకుండానే అన్ని మంచిగానే పెడుతున్నట్లుగా వార్డెన్ చెప్పిస్తూ బయటకు పొక్కకుండా జాగ్రత్త వహిస్తునట్టు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ విషయమై జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి జగదీశ్‌ను వివరణ కోరగా వసతి గృహాల్లో తప్పనిసరిగా మెనూ ప్రకారం ఆహారం అందించాలి. మెనూ అమలు చేయకుంటే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

**వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి**

గతంలో ఇదే వసతి గృహంలో వంద మంది విద్యార్థులు ఉండేవారు. ఈ వార్డెన్ వచ్చిన తర్వాత సరైన ఆహారం, వసతులు కల్పించకపోవడంతో విద్యార్థుల సంఖ్య ముప్పెక్కి తగ్గింది. ఈ విషయమై అనేక మార్లు వార్డెన్‌ను ప్రశ్నించినా, సర్వసభ్య సమావేశాల్లో నిలదీసినా ఆయన తీరు మారలేదు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి.

– నర్సింలు, ఎంపీటీసీ, దేవునూర్